క్లుప్తంగా

ప్రజా సమస్యలపై పోరాడండి



వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ నేతలు

కొయ్యలగూడెం: ప్రజలకు అండగా నిలుస్తూ వారి సమస్యలపై పోరాడుతూ ముందుకు సాగాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూచించినట్లు కొయ్యలగూడెం వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలుసుకున్న సందర్భంగా పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఓటమికి గల కారణాలను ఆయనకు వివరించినట్లు వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. రాష్ట్ర యువజన విభాగం నాయకులు కరాటం కృష్ణస్వరూప్, జిల్లా విద్యార్థి విభాగం నాయకులు దండాబత్తుల ఖగన్‌లతో కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసే విధంగా ప్రజలతో కలిసి పోరాడే సమయం త్వరలోనే రానుందని, ఇందుకు శ్రేణులు సమాయత్తం కావాలని అధినేత సూచించారని పేర్కొన్నారు. కూటమి అరాచకాలు గురించి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడుల గురించి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు.

విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో విషజ్వరాలు ప్రబలకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు తెల్లం రామకృష్ణ కోరారు. బుట్టాయగూడెంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం మంగళవారం కోర్సా జలపాలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయని అన్నారు. వీటి నివారణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. టైఫాయిడ్, మలేరియా పరీక్షలు చేసి గిరిజనులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరరావు, నాగమణి, వీరయ్య, రాజు, వెంకటలక్ష్మి, బుల్లెమ్మ, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ వ్యవసాయ భూముల కౌలుకు వేలం



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: దేవదాయ వ్యవసాయ భూముల కౌలుకు మంగళవారం మదన గోపాల స్వామి ఆలయ ఆవరణలో వేలంపాట నిర్వహించారు. ఏలూరు గ్రూప్ టెంపుల్స్ ఈఓ సాంబశివరావు, కొయ్యలగూడెం గ్రూప్ టెంపుల్స్ ఈఓ షణ్ముఖం గ్రామస్తుల సమక్షంలో ఈ వేలం జరిగింది. గోపాలపురం రోడ్డులో ఎస్సార్ పెట్రోల్ బంకు పక్కన ఉన్న దేవదాయ శాఖ 6.13 ఎకరాల పొలాన్ని రూ.1.30 లక్షలకు కేహెచ్‌పీ దుర్గాప్రసాద్ వేలంలో దక్కించుకోగా మల్లోలు పొలాల్లో ఉన్న 6.25 ఎకరాల భూమిని రూ.2.38 లక్షలకు కోన దయరాజు వేలంలో దక్కించుకున్నారు. మదన గోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపాలకృష్ణ, సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమారి, రాచూరి మదన్ నీలం రాంబాబు, సిబ్బంది పార్థసారథి, పాల్గొన్నారు.

బ్యారన్‌కు రూ.9 లక్షల పంట రుణం ఇవ్వాలి



బ్యాంక్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వర్జీనియా రైతు సంఘాల నాయకులు

జంగారెడ్డిగూడెం: 2024–25 వర్జీనియా సీజన్‌కు బ్యారన్ ఒక్కింటికి రూ.9 లక్షలు పంట రుణం ఇవ్వాలని వర్జీనియా రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, కరూర్ వైశ్యాబ్యాంక్‌ల మేనేజర్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ 2023–24 సీజన్‌లో వర్జీనియా పొగాకు పంటకు ఎకరాకు సుమారుగా రూ.3 లక్షలు ఉత్పత్తి వ్యయం అయ్యిందన్నారు. కావున 2024–25 సీజన్‌కు రుణ పరిమితి పెంచి బ్యారన్ ఒక్కింటికి రూ.9 లక్షలు ఇవ్వాలని బ్యాంక్‌ల మేనేజర్‌లను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం 2 వేలం కేంద్రాల రైతు సంఘాల నాయకులు సత్రం వెంకట్రావు, అట్లూరి సతీష్, వీవీఎస్ ప్రకాష్‌రావు, వామిశెట్టి హరిబాబు, రైతు నాయకులు పాల్గొన్నారు.

ఆషాఢం.. అన్నింటా ప్రత్యేకం

- వర్షాలూ ఆరంభం.. వ్యవసాయానికి శుభారంభం
- ఈ నెలలోనే తొలి పండుగ

బుట్టాయగూడెం: ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేసే సనాతన హైందవ సంప్రదాయంలో ప్రతినెలా ప్రత్యేకత సంతరించుకున్నదే. తొలకరి జల్లులతో ప్రకృతి పచ్చని శోభను సంతరించుకునే వేళ వచ్చే ఆషాఢ మాసం కూడా అనేక విశేషాలు ఉన్నదే. చంద్ర గమనంలో పూర్వాషాఢ నక్షత్ర సమీపంలో సంచరించే సమయం కాబట్టి ఆషాఢ మాసంగా పిలుచుకుంటారు. శుభకార్యాలకు అవకాశం లేకున్నా ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్న ఆషాఢ మాసం ఈ నెల 6వ తేదీన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏ శుభకార్యాలూ చేసేందుకు వీలు లేదని భావించే ఈ మాసం నిజానికి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. తొలి ఏకాదశి, గురుపౌర్ణమి, చాతుర్మాస వ్రతాలు, ప్రసిద్ధ జగన్నాథ రథయాత్రలు ఈ మాసంలోనే జరుగుతాయి. అలాగే ఈ



గిరిజన ప్రాంతంలో బోనాల జాతర నిర్వహిస్తున్న దృశ్యం

ఆషాఢ మాసంలోనే గిరిజన ప్రాంతంలో అనేక చోట్ల బోనాల జాతరను కూడా జరుపుకుంటారు. అలాగే గుబ్బల మంగమ్మ గుడి వద్ద కూడా అనేక మంది బోనాలు ఎత్తుకుని గుబ్బల మంగమ్మ తల్లికి సమర్పిస్తారు.



వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఓ రైతు

వ్యవసాయ పనుల్లో నిమగ్నం

ఆషాఢమాసాన్ని పూర్వీకులు శూన్యమాసంగా భావిస్తారు. ఈ శూన్య మాసంలో సాధారణంగా శుభకార్యాలు నిర్వహించరు. ఆషాఢంలో గృహప్రవేశం, నిశ్చితార్థం, వివాహం, ఉపనయనం, తదితర శుభకార్యాల నిర్వహణ అనువుగా ఉండదని భావిస్తారు. ఈ మాస ప్రారంభ సమయానికి వర్షాలు విరివిగా కురుస్తుంటాయి. దీంతో వ్యవసాయ సాగు పనులు కూడా జోరుగా జరుగుతుంటాయి. ప్రతి ఒక్కరూ వ్యవసాయ పనిలోనే నిమగ్నమవుతున్నందున శుభకార్యాలకు తావు ఉండదు.

కొత్త దంపతులకు ఎడబాటు

కొత్తగా వివాహం చేసుకున్న దంపతులను ఆషాఢ మాసంలో దూరంగా ఉంచే సంప్రదాయం అనాదిగా వస్తుంది. ఇంటిల్లపాది పంటల సాగు పనిలో తీరికలేకుండా ఉంటారు. కాబట్టి కొత్త అల్లుడికి మర్యాదలు చేసే వీలు ఉండకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. కాగా నవ దంపతులు సంసారిక జీవనం ఫలితంగా గర్భాదారణ జరిగితే ప్రసవ సమయం వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలలో ఉంటుంది. తీవ్రమైన ఎండాకాలం కాబట్టి తల్లీ బిడ్డల ఆరోగ్యానికి మంచిది కాదని ఆషాఢ మాసంలో నవ దంపతులను ఈ నెల రోజుల పాటు ఎడంగా ఉంచుతారు.

ఘనంగా టైలర్స్ డే



విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టైలర్లు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో మంగళవారం టైలర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక సూర్య టైలర్ షాప్ నందు కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి పలువురు టైలర్లు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు హోవే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టైలర్లు నేలటూరి సత్యనారాయణ, జంగం లక్ష్మణరావు, షేక్ పెంటు సాహెబ్, ఎడ్లపల్లి శ్రీనివాస్, ఎంద్రపాటి మోజేష్, తమ్మిశెట్టి వెంకటరమణ, ఎడ్లపల్లి నటరాజ్, సవరం వాణిదుర్గ, గుడివాడ అంజలి దేవి, వర్ధినీడి రంగ నాగలక్ష్మి, అరుణ తదితరులున్నారు.

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం జగన్నాథుడు శ్రీ వరాహావతారంలో సాక్షాత్కరించారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా శంకు చక్రాలను ధరించి, అమ్మవారితో ఆశీనులై ఉన్న స్వామివారి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అతిసారం.. అజాగ్రత్తగా ఉంటే ప్రాణాంతకం

- స్టాప్ డయేరియాపై విద్యార్థులకు అవగాహన
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు స్టాప్ డయేరియా కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వైద్య అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డయేరియా వ్యాధి లక్షణాలు, తీవ్రత, వ్యాధి సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటుగా డయేరియా సోకిన వ్యక్తికి చేసే వైద్య చికిత్స గురించి వివరించారు. విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తినడం వలన వాంతులు, విరేచనాలు వచ్చి అతిసారవ్యాధికి గురవుతారని, ఈ అతిసార వ్యాధి ప్రాణాంతకం అని వివరించారు. అతిసార వ్యాధిలో శరీరంలోని ఖనిజ లవణాలతో కూడిన నీరు వాంతులు, విరేచనం



బయ్యనగూడెం ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రూపంలో బయటకి పోయి డీహైడ్రేషన్‌కి గురవుతారని, సకాలంలో చికిత్స పొందకపోతే ప్రమాదం అని తెలియజేశారు. నివారణకుగాను ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని, పద్నాలుగు రోజులపాటు జింక్ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. కాచి చల్లార్చిన మంచినీటిని, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని, నిల్వ ఉన్న మాంసాహారాలు తినరాదని, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా జాగ్రత్త వహించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కే చాంద్ బాషా, హెల్త్ అసిస్టెంట్ కె.మోహన్, ఏఎన్ఎంలు ఎం.నాగమణి, జి.అనసూయ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ, ఇతర ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు శాంతి, జయలక్ష్మి, నళిని, స్వర్ణలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల: సమన్వయంతో ముందుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రజాప్రతినిధులతో అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటికి ముందుగా ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ పూలబొకేను అందించి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రజా సమస్యలపై కనీసం చర్చ జరగకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు యలమర్తి దుర్గాదేవి, ఓగిరాల చంద్ర, దాకారపు బంగారమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీవో తిరుపతిరావు తదితరులున్నారు.

సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు

కుక్కునూరు: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నెమలిపేట గ్రామంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల నుంచి 200 మంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నట్లు ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు ఎస్‌కే గౌస్ తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పార్టీ నిర్మాణం, పని విధానంపై కార్యకర్తలకు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా కేంద్ర కమిటీ నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు భారతదేశ ప్రపంచ రాజకీయ ప్రస్తుత పరిస్థితులపై శిక్షణ నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, డివిజన్ సెక్రటేరియట్ సభ్యులు కట్టం



శిక్షణా తరగతులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు

వీరాస్వామి, నాయకులు కెచ్చల రంగారెడ్డి, గెడ్డల ముత్యాలరావు, బాసినేని సత్యనారాయణ, నాలుగు మండలాల కార్యదర్శులు, పీవోడబ్ల్యూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాధాన్ ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెం పంచాయతీ పరిధిలోని పావులూరివారిగూడెంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ సమాధాన్ ఎరువుల దుకాణాన్ని మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎరువులకు సంబంధించిన ఒరిజినల్ ఇన్‌వాయిస్‌లు లేకపోవడాన్ని గుర్తించిన అధికారులు రూ.20,80,358 విలువైన ఎరువులకు స్టాప్ సేల్స్ నోటీసు ఇచ్చారు. మండలంలో మరి కొన్ని ప్రైవేట్, సొసైటీ దుకాణాల్లో ఎరువుల గోడౌన్‌లపై తనిఖీలు చేపడతామని, నాసిరకం మందులు విక్రయించడం, ఖచ్చితమైన తూకం లేకపోవడం, రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం వంటి వాటికి పాల్పడే డీలర్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో స్క్వాడ్ ఏడీఏ



సమాధాన్ గోడౌన్‌లో ఎరువుల స్టాకును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

జగదీశ్వర్‌రెడ్డి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.నాగవెంకటరాజు, ఏలూరు టెక్నికల్ ఏఓ ప్రవీణ్, మండల వ్యవసాయాధికారి ఏ దుర్గా రమేష్ తదితరులున్నారు.

వాణిజ్య పంటల సాగుతో రైతులకు ఆర్థిక లాభం

బుట్టాయగూడెం: వాణిజ్య పంటల సాగుతో రైతులు ఆర్థిక లాభం పొందవచ్చని సీటీఆర్ఐ ఆర్ఎస్ జీలుగుమిల్లి హెడ్ డాక్టర్ వైవీ సుబ్బయ్య అన్నారు. జీలుగుమిల్లిలో గిరిజన, దళిత ఉపప్రణాళికలో భాగంగా వాణిజ్య పంటలపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర ప్రాంత తేలిక నేలలకు అనువైన వాణిజ్య పంటలు, వాటి సాగు విధానాలు, వివిధ రకాల వాణిజ్య పంటల ద్వారా లభించే ఆర్థిక లాభాలు, పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. వాణిజ్య పంట మార్పిడి విధానం, పశుసాగులో వివిధ దశలను వివరించారు. అనంతరం 160 మంది ఎస్సీ, ఎస్టీ



గిరిజన రైతులకు పసుపు విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులకు పసుపు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్త ఎస్.వెంకటేషన్, ఫార్మ్ మేనేజర్ టి.వెంకటేష్, టి.రమేష్, సీహెచ్ సుధాకర్‌బాబు, వై వెంకటేశ్వరరావు, బి.దుర్గారావు, జీఎమ్ఎస్ అన్నపూర్ణ, డి.దేనానంద్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

చింతలపూడి: కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించి అమలు చేయడాన్ని నిరసిస్తూ ఈ ధర్నాను తలపెట్టినట్లు చేపట్టారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని తదితర డిమాండ్లతో స్థానిక తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం



సమావేశంలో మాట్లాడుతున్న నత్తా వెంకటేశ్వరరావు

చేయాలని కోరారు. సచివాలయ వలంటీర్ల వ్యవస్థ కొనసాగించి ప్రజల వద్దకు పాలన అందించాలని, సచివాలయ సిబ్బందిపై పని భారాలను తగ్గించాలని అన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ, మెప్మా, మున్సిపల్, ఐకేపీ, ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ మేలు

బుట్టాయగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోచమ్మ అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను జీలుగుమిల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయాల సాధన దిశగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగించారని అన్నారు. సంక్షేమ పథకాలను అందించడంలో కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటికీ చేరే విధంగా కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమగాని శ్రీను, సర్పంచ్ సిర్రి జగదాంబ, పార్టీ నాయకులు బోదా శ్రీనివాసరెడ్డి, కోర్సా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సున్నం సురేష్, తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. నాయకులు చిట్టిబొమ్మ శ్రీను, ప్రేమ్‌కుమార్, తగరం రాంబాబు, ఉప్పల రాంపండు, తదితరులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

సాగు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలి

పోలవరం రూరల్: సాగు రైతులు వారి వివరాలను వీఆర్‌వో, ఆర్ఎస్‌కే సహాయకులకు తెలియజేసి సీసీఆర్‌సీ (పంట సాగుదారుల హక్కు పత్రం) పొందాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌వో, వ్యవసాయ శాఖ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆర్డీవో అద్దయ్య మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు వారి వివరాలను తెలియజేసి సీసీఆర్‌సీ కార్డులు పొందాలన్నారు. కార్డు కాలపరిమితి 11 నెలలు ఉంటుందని, కార్డు పొందడం వల్ల మద్దతు ధర, పంట రుణం, పెట్టుబడి రాయితీ, ఇన్సూరెన్స్ పథకాలు సాగుదారులకు అందుతాయన్నారు. భూ యజమానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని, సాగుదారుడికి పంటకు మాత్రమే అర్హత కల్పిస్తుందన్నారు. గతంలో సీసీఆర్‌సీ కార్డు ఉన్న వారు దరఖాస్తుతో పాటు సీసీఆర్‌సీ కార్డు జిరాక్స్ జతచేస్తే రెన్యువల్ చేస్తామని, నూతన సాగుదారులకు నూతన కార్డులను అందిస్తామని తెలిపారు. ఈ నెల 11, 12వ తేదీల్లో సమీప రైతు సేవా కేంద్రంలో గ్రామసభలు నిర్వహించి, సాగుదారులను గుర్తించి, సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. కావున మండలంలోని రైతులందరూ సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్; వ్యవసాయాధికారి కె.రాంబాబు, రైతులు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీఆర్‌సీ కార్డులపై సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో కె.అద్దయ్య

మట్టి నమూనాల సేకరణకు రైతులు సహకరించాలి

టి.నరసాపురం: భూమిలో ఉన్న పోషకాలను తెలుసుకుని తదనుగుణంగా ఎరువులు, పురుగుమందుల వినియోగం జరగాలని ఏవో బి.సుమలత అన్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలో ఎంపిక చేసిన పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నామన్నారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో 560 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటివరకు 389 నమూనాలు సేకరించామన్నారు. మిగిలిన నమూనాలు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. సేకరించిన నమూనాలను గొల్లపూడిలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. నమూనాల ఫలితాలు అనంతరం రైతులకు సాగు చేసే పంటలు, ఎరువుల వినియోగం గురించి తెలియజేస్తామని ఏవో తెలిపారు. కాగా, మట్టినమూనాల సేకరణకు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోతన లేని లోటు తీరనిది



కొయ్యలగూడెం వృద్ధాశ్రమంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: దివంగత వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, పారిశ్రామికవేత్త పోతన శేషగిరిరావు లేని లోటు వైఎస్సార్‌సీపీకి, మెట్ట ప్రాంతానికి తీరనిదని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. మంగళవారం రోటరీ క్లబ్ వృద్ధాశ్రమంలో నిర్వహించిన శేషగిరిరావు వర్ధంతి కార్యక్రమంలో ఆయన చేసిన సేవలను వైఎస్సార్‌సీపీతో పాటు రోటరీ క్లబ్బు సభ్యులు కొనియాడారు. వృద్ధుల, అనాథల ఆశ్రమాలను ఏర్పాటు చేయడంలో శేషగిరిరావు ఎంతగానో ఆర్థిక సహాయ సహకారాలు అందజేశారన్నారు. ముఖ్యంగా స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించి నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయంతో పాటు ఉన్నత చదువులను చదివించిన గొప్ప విద్యాదాత అని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేకల అన్నవరం, నూకల రాము, రోటరీ క్లబ్ సభ్యులు మాజేటి అప్పలరాజు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, ఐవీ అప్పారావు, యాతం సత్యనారాయణ, దారం సత్యరాజు, కందెల్లి శివ తదితరులు పాల్గొన్నారు.